పంపకాలు షురూ

- అనుచరుల చేతిలోనే పార్టీ ఫండ్
- ఓటర్లకు నగదు చేరేనా?
- అన్ని పార్టీల్లో అదే తంతు

వేములవాడరూరల్: ఈ ఎన్నికల్లో ఎలాగోలా గెలవాలని ప్రధాన పార్టీల ప్రధానంగా నాయకులు సవాల్‌గా తీసుకున్నారు. దీనికి గాను 30 రోజులుగా పోటాపోటీగా ప్రచారం నిర్వహించిన నాయకులు గురువారం జరిగే పోలింగ్ నేపథ్యంలో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లకు కిందిస్థాయి క్యాడర్ ద్వారా నగదు అందజేసేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిసింది. వేములవాడ నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పోటాపోటీగా గెలుపుపై కసరత్తు చేస్తున్నాయి. ఓటర్లకు నగదు నేరుగా అందించేందుకు వారి వద్ద ఉన్న సమీప నాయకుల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా కొన్ని పార్టీల నాయకులు నమ్మదగ్గ నాయకుల ద్వారా మహిళా సంఘాలకు, ఓటర్లకు నేరుగా ఇచ్చేందుకు నగదు చేరవేస్తున్నట్లు తెలిసింది. పోలింగ్‌కు కొన్ని గంటల వ్యవధి ఉన్నందున అభ్యర్థులు వారి గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

సంఘానికి రూ. 25 వేలు?

ప్రధాన పార్టీలో ఉన్న నాయకులు వారి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధానంగా మహిళా సంఘాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. ఒక్క సంఘంలో దాదాపు 15 నుంచి 25 మంది సభ్యులకు నేరుగా డబ్బులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగానే వేములవాడ మండలంలోని అన్ని మహిళా సంఘాల్లో ఉన్న కొంతమంది ప్రధాన వ్యక్తులకు కలిసి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున ఒక సంఘానికి దాదాపు రూ.25 వేల నుంచి రూ.30 వేల చొప్పున నగదును అందజేస్తున్నట్లు తెలిసింది.

ఇతర గ్రామాల నుంచి..

మహిళా సంఘాలకు వల వేసేందుకు కొన్ని ప్రధాన పార్టీల నాయకులు ప్రత్యేకంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కొక్క మహిళా సంఘానికి పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పేందుకు చూస్తున్నట్లు తెలిసింది. వీరిలో జాతీయ పార్టీకి చెందిన నాయకులు వేములవాడ మండలమే కాకుండా ఇతర జిల్లాల నుంచి కొంతమంది నాయకులను మండలానికి రప్పించి ఈ నగదు పంపిణీని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ప్రలోభాలకు లొంగొద్దు..

సాక్షి పీపుల్స్ ఎజెండా

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట: ప్రజలకు అందుబాటులో ఉండి నిజాయితీగా పనిచేసే నాయకులకు ఓటర్లు పట్టం కట్టాలని, ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రైవేట్ కళాశాలలు,పాఠశాలలు నడిపించే వారు యువతకు పిలుపునిస్తున్నారు.ప్రలోభాలకు లొంగకండి.. ఎన్నికల చివరి ఘట్టంలో అభ్యర్థులు ఓటర్లను లోబర్చుకోవడానికి అస్త్రంగా ప్రలోభాలకు లోను చేసే సమయం వచ్చింది. ఆ వలలో పడకుండా నేటి యువత, ప్రజలు ఆలోచించి ఐదేళ్లు సక్రమంగా పనిచేసే నాయకులను ఎంచుకోని ఓటు వేయాలని ప్రైవేట్ యాజమాన్యాలు తమ అమూల్యమైన సందేశాలు వారి మాటల్లోనే..

ప్రజల కష్టాల్లో వెన్నంటి ఉండాలి



ఓట్లు వేయించుకునే నాయకులు ఎన్నికల తర్వాత ఎప్పుడు ప్రజల కష్టాల్లో వెన్నంటి ఉండాలి. నిరుద్యోగం, పేదరిక నిర్మూలనకు పనిచేసే పార్టీలకు ఓట్లేయాలి. సంక్షేమ పథకాలను ప్రజలకు పరిపూర్ణంగా అందించే నాయకులను గుర్తించి ఓట్లేయాలి. ఓటర్లు పైసలకు అమ్ముడుపోవద్దు. ప్రజల్లో నిజాయితీగా ఉండేవారిని ఎన్నుకోవడం కరెక్ట్. పార్టీల లక్ష్యాలను అవలోకనం చేసుకుని ఎన్నుకోవాలి.

– తుమ్మనపల్లి బుచ్చారావు, ప్రిన్సిపాల్, వివేకానంద విద్యానికేతన్ సిరిసిల్ల

ఓటు ప్రాథమిక హక్కు



ఓటు హక్కు అనేది రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కు. దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ నాయకుడిని ఎన్నుకునే క్రమంలో బాధ్యతతో ఆలోచించాలి. ప్రజల కష్టాలను గుర్తెరిగిన నాయకులకు ఎన్నుకుంటే మంచిది. యువతకు ఓటు వినియోగంపై మంచి అవగాహన కల్పించాలి.

– రాజ్‌కుమార్ ఇంగ్లిష్ యూనియన్ కరెస్పాండెంట్, సిరిసిల్ల

పాలకులను నిర్ణయించే అధికారమే ఓటు



మనల్ని పాలించే నాయకత్వాన్ని నిర్ణయించే అధికారమే ఓటు. ఇంతటి విలువైన ఓటును నోట్లకు అమ్ముకోవద్దు. ప్రభుత్వ ఏర్పాటు అంశం కాబట్టి బంధుప్రీతి, ఆర్థిక లావాదేవీలతో ముడివేయకుండా ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే వారికి ఓట్లేయాలి. రాజకీయ లబ్ధికై ప్రలోభాలకు గురిచేసే వారిని తిరస్కరించాలి. సమసమాజ నిర్మాణంలో ఉన్నత వ్యక్తులను ఎన్నుకోవడమే ప్రాథమిక విధి.

– శ్యాం, మాస్టర్‌మైండ్స్ స్కూల్ కరెస్పాండెంట్, సిరిసిల్ల

ఓటు హక్కును వినియోగించుకోవాలి



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే వారికే పట్టం కట్టాలి. రాజకీయ విధానం, కుల, మత, జాతి, లింగ వివక్ష లేకుండా సమాజంలో ప్రజలతో మమేకమై అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలి. విలువైన అవకాశాన్ని వృథా చేసుకోవద్దు.

– మిట్టపల్లి లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్, జ్ఞానదీప్ ఉన్నత పాఠశాల, బొప్పాపూర్

నిస్వార్థ నాయకుడికి పట్టం కట్టండి



ప్రజలకు అందుబాటులో ఉండి నిస్వార్థంగా పనిచేసే వారికే ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలి. ఒక్కసారి తప్పు చేస్తే ఐదేళ్లపాటు ఇబ్బందులు పడతాం. ఓట్ల అనంతరం ప్రజలను పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వారిని గుర్తించి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

– లతీఫ్, కరస్పాండెంట్, విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం, ఎల్లారెడ్డిపేట

నోటుకు అమ్ముడుపోవద్దు



ఐదేళ్లకోసారి అవకాశం వచ్చే వజ్రాయుధం లాంటి ఓటును నోటుకు అమ్ముడు పోనివ్వద్దు. మనం వేసే ఓటు నిజాయితీతో స్వచ్ఛందంగా వేయాలి. ఎవరు చెప్పిన ప్రలోభాలకు లోను కావద్దు. మంచి నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్న వారిని ఎంచుకోవాలి. ఒక్కసారి చేసే పొరపాటు ఐదేళ్ల గ్రహపాటుగా మారొద్దు.

– ఏలూరి రాజయ్య, కరస్పాండెంట్, గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల, ఎల్లారెడ్డిపేట

అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే వారిని ఎన్నుకోండి



పేదల కష్టాల్లో పాలు పంచుకోని, వారి సమస్యలు పరిష్కరించే వారినే ఎన్నుకోండి. నిరంతరం ప్రజల గురించి ఆలోచించే నాయకులను ఎంచుకోవాలి. పేదలకు ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు అందేలా పనిచేసే నాయకుడు కావాలి. అప్పుడే మనం వేసే ఓటుకు అర్థం ఉంటుంది. ఓట్ల అనంతరం కనిపించని నాయకులకు దూరంగా ఉండండి.

– పి.శైలజ, ప్రిన్సిపాల్, రాచర్ల జూనియర్ కళాశాల, రాచర్లగొల్లపల్లి

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



రోడ్ షోలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి, హాజరైన ప్రజలు

- సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే ఆరు గ్యారంటీలు అమల్లోకి వస్తాయని కాంగ్రెస్ సిరిసిల్ల అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల బీవైనగర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ప్రాంతంలో రౌడీయిజం, మాఫియాల రాజ్యమేలుతుందన్నారు. అవినీతి,అక్రమాలకు మంత్రి కేటీఆర్ తెరలేపారని, ప్రస్తుతం గంజాయి మాఫియాను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ అనుచరులు అన్ని పథకాల్లో లంచాలు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మిలో వచ్చే రూ.లక్షకు 30 వేలు లంచం తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ముఖ్య నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, గోలి వెంకటరమణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, వంతడ్పుల రాము, కూరపాటి శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షులు జాలగం ప్రవీణ్(టోని), దొమ్మాటి నర్సయ్య, జిల్లా నాయకుడు వైద్య శివప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ లింగం రాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ

సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, అధ్వర్యంలో దేశాయిపల్లె, రాళ్లపేట, కస్బెకట్కూర్, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

పదిరలో ర్యాలీ

ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో మాజీ మావోయిస్టు జిల్లా కార్యదర్శి షమీర్‌పాష ఉరఫ్ హరిభూషణ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

బోయినపల్లి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు వీలుగా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. బోయినపల్లి, రామన్నపేట తదితర పలు పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండలంలోని 23 గ్రామాల్లో 41 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 18 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగిస్తున్నట్లు, మరో 18 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుష్పలత తెలిపారు. అలాగే 9 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 30,273 మంది ఓట్లు ఉన్నారు. ఇందులో 14,735 పురుషులు, 15,538 మంది స్త్రీలు ఉన్నారు.



పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలం పోతుగల్‌లో ఓ పార్టీ నాయకులు కోడ్ ఉల్లంఘించారనే సీవిజిల్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోతుగల్‌లో మంగళవారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయాల్లో సామాజిక సమావేశాలపై సీ విజిల్‌కు ఫిర్యాదు అందిందని తెలిపారు. ఎవరు నిబంధనలు అతిక్రమించరాదన్నారు. సీ విజిల్ ఫిర్యాదు మేరకు పలువురుపై కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

పోటాపోటీగా చివరి రోజు ప్రచారం



ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఎన్నికల ప్రచారాన్ని అన్ని పార్టీలు చివరి రోజున మంగళవారం పోటాపోటీగా చేపట్టారు. ముస్తాబాద్‌లో ప్రధాన వీధుల వెంట నాయకులు, కార్యకర్తలు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పార్టీల గుర్తులతో ర్యాలీలు చేపట్టారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

తంగళ్లపల్లి: రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. మంగళవారం పోలీస్ సిబ్బందితో కలిసి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎలక్షన్ డే అంటే హాలిడే కాదని మన భవిష్యత్తును నిర్దేశించుకునే అతి కీలకమైన రోజుగా గుర్తించాలని సూచించారు. విద్యావంతులు ఉండే పట్టణాలు, నగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు.

వైభవంగా రథోత్సవం



రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవ వేడుక వైభవంగా జరిగింది. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం

చొప్పదండి/గంగాధర: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోంది, ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి పట్టణంలోని మార్కెట్ రోడ్డులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని, అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పెన్షన్ల పెంపు, రుణమాఫీ, 108 సేవలు కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం, చేయూత పథకాలు అమలు చేస్తామన్నారు. వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పురం రాజేశం, కొట్టె అశోక్, పెరుమాండ్ల మానస, రంగయ్య, సుధాకర్‌గౌడ్, బుచ్చయ్య, నర్సయ్య, విద్యాసాగర్ రెడ్డి, నర్సింగరావు, యాదగిరి పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

రెండుసార్లు ఓడినా పదేళ్లుగా మీ వెంటే ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశా మూడోసారి పోటీ చేస్తున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని మేడిపల్లి సత్యం ఓటర్లను అభ్యర్థించాడు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. గతంలో గెలిచిన నాయకులు ప్రజా సమస్యలు పట్టించు కోలేదని, తిరిగి వారే మళ్లీ పోటీ చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నారాయణపూర్ రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేస్తా, ఎల్లమ్మ చెరువు మరమ్మతు చేయిస్తానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అర్హులకు అందేలా చూస్తానన్నారు.



చొప్పదండి పట్టణం మార్కెట్ రోడ్డులో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం



మధురానగర్ చౌరరస్తాలో సత్యం ప్రచారం

అవినీతి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఓటర్లను కోరారు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారం, భారీ ర్యాలీ చేపట్టి ముగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేళ్లు అధికారం ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. అధ్వానంగా మారిన రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ నాయకుల ధర్నా, రాస్తారోకోలు చేపట్టితే రహదారి నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. అభివృద్ధిపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదని, కమీషన్లకు పాల్పడుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అనేక ఇళ్లు నిర్మించామని, కేసీఆర్ పాలనలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా అని ప్రశ్నించారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు ఏమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎంపీపీ ముద్దసాని సులోచన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక చేసే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రెండు లక్షల రుణమాఫీ, రెండు వందల యూనిట్లలోపు విద్యుత్, ఆడపిల్ల పెళ్లికి లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కవ్వంపల్లి సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, మాజీ సర్పంచ్ మడుపు శ్యాంసుందర్, అపరాజు శ్రీనివాస్, గోశెట్టి సత్యనారాయణ, గసికంటి సంపత్, కోండ్ర సురేష్, ఇర్ఫాన్, దూలం దేవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

సిరిసిల్లలో ఉద్రిక్తత

- ఇరుపార్టీ నాయకుల మధ్య వాగ్వాదం

సిరిసిల్లటౌన్: ఎన్నికల ప్రచారం ముగింపు వేళ ఇరు రాజకీయ పార్టీల మధ్య వాగ్వాదం సిరిసిల్లలో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్, ఏఐఎఫ్‌బీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో ఏఐఎఫ్‌బీ అభ్యర్థి పత్తిపాక సురేశ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో చౌరస్తాలో పెద్ద ఎత్తున జనం గుమిగూడడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులు కలుగచేసుకోని ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తకుండా నిలువరించారు. చాలాసేపు ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు క్లియర్ చేశారు.



ఆగయ్యతో వాదిస్తున్న సురేశ్

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ముస్తాబాద్: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీశివకేశవ ఆలయంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సహస్ర దీపాలంకరణ, కూచిపూడి నృత్య ప్రదర్శనతోపాటు సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హరీశ్‌శర్మ పంతులు ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతాలు, శివార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య, టీడీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మట్ట రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ రాజారాం, చంద్రం, శ్రీనివాస్, మెంగని లింగం పాల్గొన్నారు.



నృత్యప్రదర్శనలో చిన్నారులు